# కొత్త చీపురు

-డా. బి.దామోదరరావు

'నిశ' బార్లో పూటుగా తాగిగ్రు దొర, కరణం పంతులు, షాహుకారు.

"అన్నలు చర్చల్లో పడ్డరు గిప్పుడే గింత ఊర్లల్లకు పోవత్తది పోదామా" అడిగిండు దొర.

కరణానికి తన భూమిలో పెట్టెలో పెట్టి పాతిపెట్టిన పాత పట్టా కాగితాలు, యాదికొచ్చినయి.

షాహుకారుకు, గిరివి, కాగితాలు, చిట్టాలు యాది కొచ్చినయి. దొరకేమో, బంగారం, నోట్ల కట్టలు యాది కొచ్చినయి. గింత నిశాలోను హుశారొచ్చింది.

"గట్లనే పోదాం పంగ్రి" అన్నడు పంతులు, షాహుకారు. గిప్పుడు పోతే మన లచ్చపేట ఎంత దూరముంది, జెప్పనపోతే తెల్లార్తది, మల్ల ఎంటనే మల్లొచ్చు" దొరన్నడు.

"గట్లనే పోదాం" అన్నారిద్దరు.

'బిల్' చెల్లించిండు దొర. మూతి తుడుచుకున్న రిద్దరు. బయటకొచ్చి దొర తన కారు తీసిండు.

"కొత్తది కొన్నావే, ధర్మన్నా" పంతులు అడిగిండు. అవునే గిది మొన్ననే, మా అమెరికా అల్లుడు కొని పంపించిండే" గర్వంగా అన్నడు ధర్మారావు.

"గట్లనా, తమరు అల్లునికి కొని పెట్టకున్నా, అల్లుడే తమరికి కొనిపెట్టిండు గింత మంచి అల్లుడు మాకు దొరకొద్దూ, ఏం పంతులూ" అన్నాడు షాహుకారు నవ్వుకుంట.

"ఆ, ఆ, ఆ చెలుక (అది మాదిగ నర్సిగానిది బెదిరించి అప్పు కిందికి తీసుకున్నది మనసులో యాది కొచ్చింది) మొత్తం అమ్మిన పైసలు పెట్తేనే గదనే గా అల్లుడు అమెరికా పోయింది" అన్నాడు దొర.

"గట్లనా" నవ్విండు షాహుకారు. పంతులు అవు నన్నట్లు తల ఊపుడు చూచి.

ముగ్గురు కార్ల కూచున్నరు.

కారు ఊరి వైపు హుషారుగా పోతున్నది.

తెల్లవారుతున్నది, దొర కారు తోలుతున్నడు.

ఊరి దగ్గరికి వచ్చింది కారు.

దొరకు మందు మత్తు, నిద్ర మత్తు ముంచు కొచ్చింది.

ఎదురుంగ బర్ల మంద కనిపించింది.

దొర కారును అటు ఇటు తిప్ప వట్టిండు. 'హారన్' కొట్టగానే బర్లు బెదిరినయి.

షాహుకారు, కరణం పంతులు, నిద్రమత్తులో జోగుతున్నరు. బర్రె కారుకెదురుగ ఉరికొచ్చింది.

దొర దాన్ని తప్పించుకునేందుకు, పోబోయిండు బండి అదుపు తప్పి పక్క పొంటి దూసుకపోయి, చెట్టుకు గుద్దుకుంది.

చెట్టు గుబురుగా ఉంది. ఎత్తుగా ఉన్నా, అన్ని మండలే. గా చెట్టు కొమ్మల్లో ముగ్గురు చిక్కువడ్డారు.

దొర దోతి, షాహుకారు బనీను, పంతులు అంగి, వాళ్ళ ప్రాణాలైతే కాపాడినయి.

తలో దిక్కు వెలాడవట్టిగ్రు.

పెయ్యంత చీరుకపోయింది.

దూరంగ మనిషి వస్తున్న జాడ.

మసక వెలుతురులో, పంతులుకు కనిపించింది.

'హమ్మయ్య' అనుకున్నడు.

దొర కూడ చూచిండు.

'ఒరేయ్' అనబోయి మునుపటి కాలం కాదని 'ఏమయ్యా' అని పలుకరించిండు. గాన్ని చూడగానే షాహుకారు ప్రాణం పైపైనే పోయింది.

గాడు, రాగ్యా కొడుకు భూక్యా.

భుజం మీద గొడ్డలితో పరుశురాముని లెక్కున్నడు గాళ్ళ పొలం తనఖీ పెట్టుకుని తాను పైకమిచ్చిండు. గా పొలమే, దొర కౌలుకు తీసుకుంటనని ఆక్రమిం చిండు. గా పొలమే పంతులు పైసలు తీసుకొని, పైరవీ నడిపి, రెవిన్యూ అధికారులకు 'తడిపి' దొర పేర పట్టా చేసిండు. ముగ్గురికి చెమటలు పట్టినయి, తెల్ల వారింది, అనుకుంటున్నరు.

బతుకు కూడా తెల్లవారిందని బుగులైతున్నది. భూక్యా చెట్టు దగ్గరికి వచ్చిండు.

కారు నుజ్జు నుజ్జు అయింది, ఎవరో పెద్దింటోళ్ళే బతికుంటే కాపాడాలనుకున్నడు. ఆత్రుతగా, వేగంగా వచ్చిండు. ఏడున్నరని అటు ఇటు సూసిండు; మూల్గులు వినిపించినయి సన్నగా. వింటే, వీడే చంపుతడమో అని 'త్రిమూర్తుల' భయం.

గాళ్ళను సూడంగనే, రక్తం మరిగింది; చెయ్యి,

గొడ్డలి మీదికి పోయింది; చంపినా, ప్రమాదంలో సచ్చిన్రనుకుంటరు అనిపించింది.

కాని, గీ మధ్య, రాత్రి పూట తనకు పాఠాలు చెబుతున్న 'సత్యం' సార్ మాటలు యాదికొచ్చినయి.

'చంపుడు' శిక్ష కాదని, వాళ్ళ తప్పులకు వాళ్ళ జీవితాంతం బాధపడేలా శిక్ష ఉండాలనీ, అనేవాడు.

వాడి కళ్ళు చింత నిప్పులయినాయి.

కొత్త గొడ్డలి చింత మొద్దులు పగులాలని నూరిపించిండు. దాన్ని చెట్టు మొదలుపై దెబ్బమీద దెబ్బ కసి కసిగా వేసిండు. వాళ్ళను తలుచుకుంటూ కొడ్తనే ఉన్నడు. పంతులు, దొర, షాహుకారు, బతుకు మీద ఆశ వదులుకున్నరు. దెబ్బ మీద దెబ్బ, వేసిండు భూక్యా.

తెల్లవారింది, సూర్యుడు పొడిచిండు.

ఊర్ల జనం ఉరికి వచ్చిన్రు.

ఒక్కళ్ళ నుంచి ఒకళ్ళకు తెలిసిపోయింది.

భూక్యా చెట్టు పడగొట్టిండు. దాన్ని పట్టుకున్న అవినీతి భూతాలు కింద పడ్డయి.

దొర నడుమిరిగింది.

పంతులు చేతులిరిగినయి.

షాహుకారు కాళ్ళిరిగినయి.

ఊర్లో జనం ఉరికి వచ్చిన్రు.

ఉమ్ములతో, దుమ్ములతో– పలుకరించిన్రు

మైనరు లచ్చి చీపురు చూపింది

బెస్త లస్మడు చెప్పు చూపిండు

సత్యం సార్ వచ్చిండు,

జనాన్ని శాంత పర్చిండు.

'భూక్యా. మానవతా ధర్మం ప్రదర్శించినందుకు అభినందించిండు.

గాయింత, బండి కట్టించి పక్క ఊరు 'సిరిసిల్ల' దవఖానకు వెంట ఉండి కొంట పోయిండు;

దొర, షాహుకారు, పంతులు, తగిలిన గాయాలతో విరిగిన అవయవాలతో, తీరని రందితో మంచం పట్టిన్రు, ఒక్కళ్ళు కోలుకోలేదు.

గాళ్ళ మనసుల్లో గతం తిరుగవట్టె

చేసిన 'గాయి గత్తర' యాదికి రావట్టె

ఇగెట్ల కోలుకుంటరు; ఏడ్వవట్టిరి.

కొత్త చీపురొస్తుంది–చెత్తకేడుపొస్తుంది **–మహాకవి కాళోజీ**

■

## జానీ నానీలు

**జీ**వితం
ప్రయాణం
కొందరికి బరువులుండవు
కొందరు సర్దుకుపోతారు

**చి**రునామా దొరికింది
నానీల నాన్న 'గోపి'
అన్న భల్లం
ఊరు సోమేపల్లి

**మె**ట్లు
ఎక్కే వాడికి పరీక్ష
లిఫ్టు
ఎక్కిన వాడికి సురక్ష

**ది**న చర్య
భగ్నపరిచే కేక
అయినా అతడి రాక
ఆనందం 'పోస్ట్‌మేన్'

**సు**ఖం కోసమే
కష్టాన్ని భరించింది
వెలుగు కోసమే
చీకట్లో గడిపింది

**నీ**వు ఇజాల
మనిషయినా
వెల్లడించే నిజం
ఎంతో విలువైనది

**మా** ఇంట్లో
'అమ్మ' వుంది
బడి గుడి చెంతనే
వున్నాయని ఎంతో తృప్తి

**త**లగడ కింద
పుస్తకం వుంటే సరా
మనసు పెట్టనిదే
మెదడులో ఎక్కునా

**కృ**తజ్ఞత
పరాయి పెంపుడు చిలక
సహాయం
నీ తోట పండు

**–సయ్యద్ జాని బాష**